# లౌకికవిద్యతోపాటు ఆధ్యాత్మిక విద్య అత్యవసరం

సదయం హృదయం యస్య భాషితం సత్య భూషితం
కాయం పరహితే యస్య కలి తస్య కరోతికిం ?

ప్రేమస్వరూపులారా! విద్య అనగా ఏమిటి? ఎటువంటి విద్యను అభ్యసించాలి? విద్యయొక్క ప్రధానలక్ష్యమేమిటి? విద్యయొక్క విశిష్టత ఏమిటి? ఇప్పటి విద్యవలన మనకు కల్గుతున్న ఫలిత మేమిటి? అనే పంచతంత్రములను మనం మొట్టమొదట చక్కగా విచారణ చేయాలి. ప్రాపంచిక విషయాలకు సంబంధించినది – 'ఎడ్యుకేషన్'; అంతర్భావమునకు సంబంధించినది – 'ఎడ్యుకేర్'. ఈనాటి విద్యావిధానంలో విద్యార్థులు కేవలం బహిర్ముఖమైన విషయాలను మాత్రమే నేర్చుకుంటున్నారు. అందరికీ ఆనందము నందించవలెనన్న అంతర్భావానికి సంబంధించిన 'ఎడ్యుకేర్'ను అభివృద్ధి పరచాలి.

## సంస్కారం లేని చదువు నిరర్థకం

వ్యక్తిత్వమనేది సంస్కారంవల్లనే అభివృద్ధి అవుతుందిగాని, చదువువల్ల కాదు. విద్యతోపాటు సంస్కారం అత్యవసరం. సంస్కారం లేని విద్య చెల్లని కాసువంటిది, చీకటి కొంపవంటిది. చీకటింటిలో గబ్బిలాలు మాత్రమే నివసించగలవు. అదేరీతిగా, సంస్కారహీనుడైన విద్యావంతుని హృదయం దుర్గుణాలకు నిలయమౌతుంది. సంస్కారం లేని విద్య దారం తెగిన గాలిపటమువంటిది. అది ఎప్పుడు ఎక్కడ పడిపోతుందో చెప్పటానికి వీలుకాదు. అదేరీతిగా సంస్కారం లేని విద్య ఎవరికి బాధ కల్గిస్తుందో, ఎవరి కొంపను కూల్చుతుందో చెప్పలేము. సంస్కారం తోడైనప్పుడే చదువు రాణిస్తుంది. సంస్కారమనగా ఏమిటి? చెడ్డను దూరం చేసుకొని మంచిని స్వీకరించటమే సంస్కారం. హృదయాన్ని విశాలం గావించుకోవటమే సంస్కారం. దుర్గుణములను, దురాలోచనలను దూరం గావించుకొని సద్గుణములను, సద్భావములను

srisathyasaivachanamrutam

ఆవిర్భవింపజేసుకోవాలి. కొద్దిసేపటి క్రిందట ఇక్కడ కొంతమంది I and you are one (నేను, నీవు ఒక్కటే) అనే పాట పాడారు. దీనికంటే All are one (అందరూ ఒక్కటే) అనే భావం చాలా మంచిది. అందరిపట్ల సమత్వంతో వర్తించాలి. మనయందు అలాంటి విశాలమైన భావం ఆవిర్భవించాలంటే 'ఎద్యుకేర్'ను అభివృద్ధి గావించుకోవాలి.

**అనుభవజ్ఞానానికి సంబంధించినది 'ఎద్యుకేర్'**

ఈనాటి విద్యార్థులు అభ్యసించే విద్య ప్రాకృతమైనది. ఇది కేవలం Bookish knowledge (గ్రంథపరిచయం). దీనిని Superficial Knowledge (మిడిమిడిజ్ఞానం) అని చెప్పవచ్చును. ఇది మార్పు చెందుతూ ఉంటుంది. ముఖ్యంగా విద్యార్థులు General knowledge ని, Common sense ని పోషించుకోవాలి. ఏది సత్యము? ఏది అసత్యము? అనే Discrimination knowledge ని (విచక్షణాజ్ఞానమును) అభివృద్ధిపరచుకోవాలి. క్రమ క్రమేణా Practical Knowledge (అనుభవజ్ఞానము) లో ప్రవేశించాలి. ఇదే 'ఎద్యుకేర్'. ఇది నిత్యసత్యమైనది, ఏనాటికీ మార్పు చెందదు.

నిజమైన విద్యావంతుడు దుర్గుణములకు తావీయడు, దుశ్చర్యలకు పాల్పడడు. విద్య అనగా జ్ఞానము అని అర్థం. జ్ఞానమనగా గ్రంథపరిచయం కాదు. ఈనాటి విద్యార్థి బుకిష్ నాలెడ్జితో తలను నింపుకొని, ఎగ్జామినేషన్ హాలుకు వెళ్ళి తలలో ఉన్నదంతా పేపరుపై క్రుమ్మరించి ఖాళీ తలతో బయటికి వస్తాడు. విద్యార్థులు సంపాదించవలసింది బుకిష్ నాలెడ్జి కాదు. అయితే లౌకికజీవితమును పోషించుకునే నిమిత్తం ఇది కూడా కొంతవరకు అవసరమే. దీనితోపాటు ఆధ్యాత్మికవిద్యను కూడా అభ్యసించాలి. "అధ్యాత్మ విద్యా విద్యానాం" అన్నది భగవద్గీత. చాకలివాడు ఇంటింటికీ వెళ్ళి వాళ్ళు వేసే బట్టలు తీసుకుంటాడు. ప్రతి ఇంటివారు తాము వేసిన బట్టలను ఒక నోట్‌బుక్కులో వ్రాసుకుంటారు. కాని చాకలివాడు ఎవరు ఏ బట్టలు వేశారనేది ఏమీ వ్రాసుకోడు. అయినప్పటికీ సాయంకాలం ఎవరి బట్టలను వారికి కరెక్టుగా తెచ్చిస్తాడు. ఒక చాకలివానికున్నంత జనరల్ నాలెడ్జి కూడా నేటి విద్యావంతులకు లేకపోతున్నది. జనరల్ నాలెడ్జి అనేది చదువుతో వచ్చేది కాదు. జన్మతః అది మీలోనే ఉన్నది. దానిని అభివృద్ధి గావించుకోవాలి.

srisathyasaivachanamrutam

విద్యార్థులారా! మేము గొప్ప చదువులు చదివాము, గొప్ప డిగ్రీలు తీసుకున్నాము అని 'క్వాన్టిటీ'ని చూసి మురిసిపోకండి. 'క్వాలిటీ'ని పెంచుకునే నిమిత్తం 'ఎడ్యుకేర్'ను అభివృద్ధిపరచుకోండి. మీరు సంపాదించిన జ్ఞానమును ఆచరణలో పెట్టండి, పదిమందికి పంచండి. విద్యయొక్క ప్రధానలక్ష్యమేమిటో విచారణ చేయండి. విద్య జీవితపరమావధికేగాని, జీవించటానికి కాదు. మీరు విద్యను కేవలం జీవించటానికి మాత్రమే ఉపయోగపెడుతున్నారు. జీవించటానికి విద్య కావలెనా? ఎట్టి విద్యలూ ఎఱుగని చీమలు, దోమలు, పశుపక్షిమృగాదులు జీవించటం లేదా? విద్యయొక్క సారమేమిటి? Concentration of mind, and not collection of facts. విద్యయొక్క సారం ప్రాపంచిక విషయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించటం కాదు. ఈ సేకరణలో మునిగి మానవుడు తనను తాను మరచిపోతున్నాడు.

విద్యయొక్క పరమావధి ఏమిటి? ఇది చాలా ముఖ్యమైనది. కాని దీనిని ఎవ్వరూ గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. శీలనిర్మాణమే విద్యయొక్క పరమావధి. శీలము లేని విద్య నిరర్థకం. పూర్వకాలంలో మహర్షులు రాత్రి, పగలు అనే భేదం లేకుండా శిష్యులకు విద్యాబోధన చేసేవారు. తామెక్కడికి వెళ్ళినా శిష్యులను వెంట పెట్టుకొని వెళ్ళేవారు. నడుస్తూ వెళ్ళేటప్పుడు కూడా వారికి ఉపదేశం చేసేవారు. కాని నేటి విద్యావిధానం అందుకు భిన్నంగా ఉంది. ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 వరకు, తరువాత 2 నుండి 5 వరకు... ఈరీతిగా కాలపరిమితిని ఏర్పర్చుకొని విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఇదంతా పరిమితమైన జ్ఞానము. కాని శీలసంపత్తికి ఒక పరిమితి లేదు. నిత్యజీవితంలో మీ మాటలలో, మీ నడతలో అది ప్రతిబింబించాలి. మీ మాటలు పవిత్రంగా, సున్నితంగా, ఇతరులకు బాధ కల్గించనివిగా ఉండాలి. మీరు చేసే ప్రతి పనిలోనూ విచక్షణనుపయోగించాలి. ఉదాహరణకు, ఒక సేరు బియ్యం ఉడికించాలంటే ఎంత పాత్ర కావాలి? ఎంత మంట వేయాలి? అనే విచక్షణ అవసరం. పదార్థమును బట్టి పాత్రను, పాత్రను బట్టి పదార్థమును మార్చుకోవాలి. వంటకు తగిన మంట వేయాలి, మంటకు తగిన వంట చేయాలి.

అదేవిధంగా మీ నిత్యజీవితంలో ప్రతి పనిని విచక్షణనుపయోగించి చేయాలి. అప్పుడే

sri sathyasai vachanamrutam

శీలసంపత్తి చేకూరుతుంది. విద్యార్థులారా! ఎవరైనా పెద్దలు మీ ఇంటికి వచ్చినప్పుడు మృదుమధురంగా మాట్లాడి వారిని సంతోషపెట్టాలి. కొందరు పిల్లలు ఇంటికి వచ్చిన పెద్దలతో చాలా దురుసుగా ప్రవర్తిస్తారు. నాన్నగారు ఇంట్లోనే ఉన్నా లేరని అబద్ధం చెబుతారు. ఇది చాలా తప్పు. ఉంటే ఉన్నాడని చెప్పాలి, లేకపోతే లేడని చెప్పాలి. అంతేగాని, అబద్ధం చెప్పకూడదు.

**నిజము – సత్యము – ఋతము**

నిజము, సత్యము, ఋతము అనే మూడు పదములున్నాయి. అప్పటికప్పుడు ఉన్నది ఉన్నట్లుగా చెప్పటం నిజము. ఉదాహరణకు నీవు తెల్లడ్రస్సు వేసుకొని ఇక్కడికి వచ్చావు. నేను నిన్ను తెల్లడ్రెస్సుతో చూశాను. ఇది నిజము. అయితే నీవు ఇంటికి వెళ్ళిన తరువాత తెల్లడ్రస్సును మార్చి బ్లూబుష్‌కోటు ధరిస్తావు. అప్పుడు నేను చెప్పింది నిజము కాదు. నేను చూసినప్పుడు చెప్పింది మాత్రమే నిజము. తరువాత అది మార్పు చెందవచ్చు. సత్యమంటే ఏమిటి? త్రికాలములందు మార్పు చెందనిది సత్యము. నీవు ఎన్ని డ్రస్సులైనా మార్చవచ్చు. కాని నీవు నీవుగానే ఉంటావు. అట్టి మారని తత్త్వమే సత్యము. దీనిని పురస్కరించుకొనియే నేను అప్పుడప్పుడు చెబుతుంటాను – నీవు ఒక్క వ్యక్తివి కాదు, నీలో ముగ్గురున్నారు. ఎవరా ముగ్గురు? The one you think you are (నీ దృష్టిలో నీవు – దేహము). ఇది భౌతికమైన రూపము. The one others think you are (ఇతరుల దృష్టిలో నీవు – మనస్సు). మనస్సు ఎవ్వరికీ కనిపించదు. అయితే నీవు చేసే పనులను బట్టి నీ మంచి చెడ్డలను నిర్ణయిస్తారు. ఈ రెండింటికీ అతీతమైనది ఒకటున్నది. అదే The one you really are (అసలైన నీవు – ఆత్మ). అదే ఋతము. దేహం మార్పు చెందుతుంది. కాని మనయందున్న ఆత్మ ఎప్పటికీ మార్పు చెందదు, అది శాశ్వతంగా ఉంటుంది. దీనిని వేదము "నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మలస్వరూపిణం" అని వర్ణించింది. దీనినే ఋతము అన్నారు.

**"జాగ్రత్త! జాగ్రత్త!"**

జాగ్రదవస్థలో నీ దేహంతో నీవు అనేకచోట్లకు ప్రయాణిస్తున్నావు, ఎన్నో దృశ్యాలను

srisathyasaivachanamrutam

చూస్తున్నావు, అనుభవిస్తున్నావు. "వీటన్నింటినీ నేనే అనుభ విస్తున్నాను" అంటావు. స్వప్నావస్థలో నిన్ను నీవే సృష్టించుకొంటున్నావు; ఏ బస్సు టికెట్టుగాని, ప్లేను టికెట్టుగాని కొనకుండా ఢిల్లీకి వెళుతున్నావు, అమెరికా అంతా తిరుగుతున్నావు. కాని సుషుప్తిలో ఎక్కడికీ కదలక మెదలక ఆనందాన్ని అనుభవిస్తున్నావు. ఈ మూడు అవస్థలనూ అనుభవించేది నీవొక్కడివే. జాగ్రదవస్థలో అనుభవించేవన్నీ ఇంద్రియసంబంధమైన అనుభూతులే. మనస్సు చాలా చంచలమైనది. ఇలాంటి మనస్సును అరికట్టే నిమిత్తం ఆదిశంకరులవారు తన ఆశ్రమంలో ఒక ఏర్పాటు చేశారు. అదేమిటంటే ద్వారం ముందు ఇరువురు శిష్యులు చెరొకవైపు నుండి అటూ ఇటూ తిరుగుతూ "జాగ్రత్త! జాగ్రత్త! అని అంటూ ఉండాలి. ఒనానొక సమయంలో శంకరులవారు "నాకింత పెద్ద ఆశ్రమమున్నది. దీనికంతా నేనే అధిపతిని" అనుకున్నారు. అదే సమయంలో బయటినుండి "జాగ్రత్త! జాగ్రత్త!" అని వినిపించింది. వెంటనే ఆయన తన పొరపాటును గుర్తించారు. మానవజీవితం గురించి, జనన మరణముల గురించి, లౌకికమైన సంబంధబాంధవ్యముల గురించి శంకరులవారు చక్కగా విచారణ చేసి సత్యాన్ని లోకానికి చాటుతూవచ్చారు.

> జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునః పునః
> అంత్యకాలే మహా దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత
> మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధు స్సహోదరః
> అర్థం నాస్తి గృహం నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత

ఇట్టి సత్యాన్ని ప్రాచీన మహర్షులు గురుకులంలో విద్యార్థులకు బోధించేవారు. కనుకనే ఆనాటి విద్యావంతులు పవిత్రమైన జీవితాన్ని గడిపేవారు. ఆనాటి విద్య 'ఋతము" నుండి ఆవిర్భవించినది. దానినే ఈనాడు మనం "ఎడ్యుకేర్" అని పిలుస్తున్నాము. ఎడ్యు'కేర్' (Edu'Care') అనగా, మనం ఎల్లప్పుడు జాగ్రత్తగా ఉండాలి. దీనినే ABC of life అన్నారు. అనగా Always Be Careful (ఎల్లప్పుడు జాగ్రత్తగా ఉండు) అని అర్థం. ఇదే శంకరులవారు బోధించింది. ఈనాడు మనం విద్యార్థులకు లౌకికవిద్యతోపాటు ఇట్టి ఆధ్యాత్మిక విద్యను కూడా బోధించాలి. లౌకిక విద్య నెగిటివ్, ఆధ్యాత్మిక విద్య పాజిటివ్. లౌకిక విద్య

srisathyasaivachanamrutam

కేవలం ఒక బల్బువంటిది. అందులో ఆధ్యాత్మిక విద్య అనే కరెంటు ప్రవేశించినప్పుడే మనం ప్రకాశమును అందుకోగలము.

**మూలాధారతత్త్వం**

దివ్యత్వమనే పాజిటివ్ శక్తి సర్వులయందున్నది. కాని, ఈనాటి మానవుడు పాజిటివ్‌ను విస్మరించి తనలో నెగెటివ్‌ను అధికంగా చేర్చుకుంటున్నాడు. పుట్టటం, పెరగటం, చావటం.... ఇవన్నీ నెగెటివ్ లక్షణాలు.

**చావు, పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**అది మధ్యాంతరహితు డనాదివాడు**
**తాను పుట్టక చావక చంపబడక**
**అంతటను సర్వసాక్షియై అలరుచుండు**

ఈ ఆధ్యాత్మికతత్త్వమే అన్నింటికీ మూలాధారమై ఉన్నది. ఈ Fundamental Knowledge (మూలాధారమైన జ్ఞానం) ఇతర జ్ఞానములన్నింటి కంటే అధికమైనది. ఇందులోనే అనంతమైన ఆధ్యాత్మికతత్త్వము ఇమిడియున్నది. అన్నీ దీని నుండియే ఆవిర్భవిస్తాయి. కాబట్టి మొట్టమొదట మనం Fundamental Knowledge ని సంపాదించుకోవాలి. ఋతమును ఆధారం చేసుకొని జీవితాన్ని గడపాలి. దేహభ్రాంతిని విడనాడాలి. ఒక నలభై సంవత్సరాల తల్లికి పదహైదు సంవత్సరాల కుమారుడున్నాడు. తల్లి మరణించింది. అప్పుడు కుమారుడు “అమ్మా! నన్ను వదలిపోతివా” అని ఏడుస్తున్నాడు. ఇక్కడ విచారణ చేస్తే, అతనిని వదలిపోయింది ఎవరు? ఇంతకాలం తన తల్లి అని భావించిన దేహము తన కంటి ఎదురుగానే ఉన్నదే! మరి “నన్ను వదలిపోతివా” అని ఎందుకంటున్నాడు? కాబట్టి ఆ దేహము కాదు అతని తల్లి. ఆ దేహాన్ని వదలింది ఏమిటి? ప్రాణం. కాబట్టి ప్రాణమే అతని తల్లి. ప్రాణానికి మరణం లేదు. దేహమనేది మనం ధరించిన వస్త్రంవంటిది.

జీసస్ చెప్పాడు - Death is the dress of life. ఇది మార్పు చెందుతూ ఉంటుంది. అన్నింటికీ ఆధారమైనది లోపల ఒకటున్నది. అట్టి మూలాధారతత్త్వానికి సంబంధించిన విద్యను విద్యార్థులకు నేర్పాలి. కేవలం దేహాన్ని మాత్రమే లక్ష్యంగా పెట్టుకొని



sri sathyasaivachanamrutam

జీవితాన్ని గడపకూడదు. మనలో ఉన్న ఆత్మతత్త్వాన్ని ఆధారం చేసుకోవాలి. దీనినే 'ఎడ్యుకేర్' అన్నారు. 'ఎడ్యుకేషన్' తోపాటు 'ఎడ్యుకేర్' కూడా అవసరం. 'ఎడ్యుకేర్' లేక 'ఎడ్యుకేషన్' వలన ప్రయోజనం లేదు.

**మనస్సు యొక్క తలుపులను తెరిచేదే నిజమైన విద్య**

ప్రేమస్వరూపులారా! మీకేమైనా సందేహాలుంటే వాటి గురించి రేపు మాట్లాడుకుందాం. మొట్టమొదట విద్య అంటే ఏమిటో తెలుసుకోండి. నేను ఇంతకుముందు చెప్పిన పంచతంత్రములను చక్కగా విచారణ చేసినప్పుడు మీకు అన్నీ సులభంగా అర్థమౌతాయి. ఎడ్యుకేషన్ అంటే నోటితో చెప్పేది కాదు, బ్లాక్ బోర్డుపై వ్రాసేది కాదు. మనస్సు యొక్క తలుపులను తెరిచేదే నిజమైన ఎడ్యుకేషన్. తలుపులను మూసివేసి రమ్మని పిలుస్తుంటే లోపలికి వెళ్ళేదెలా? మీరు సుఖమును, సౌభాగ్యమును ఆశిస్తున్నారు. అవి మీకు లభ్యం కావాలంటే మీ మనస్సుయొక్క తలుపులను తెరవాలి. మన సంస్థలవారు కేవలం 'యూనిఫామ్ డ్రస్సు' వేసుకుంటే సరిపోదు; 'యూనిఫామ్ మైండు'ను కల్గియుండాలి. మనస్సు పవిత్రంగా, సంస్కరింపబడినదిగా ఉండాలి.

**"అద్వైత దర్శనం జ్ఞానం"**

ప్రేమస్వరూపులారా! ఈనాటి విద్యావిధానంలో మీరు తెలుసుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. కాని, మీరు తెలుసుకోవలసినవి తెలుసుకోకుండా అనవసరమైనవాటినంతా తెలుసుకుంటున్నారు. పుస్తకాల్లో ఉన్న విషయాలను మాత్రమే మీరు స్వీకరిస్తున్నారు. అది కేవలం లౌకికమైన 'ఎడ్యుకేషన్'. ఈ 'ఎడ్యుకేషన్'కు 'ఎడ్యుకేర్'ని కూడా చేర్చాలి. అప్పుడే మీకు ఆనందం కల్గుతుంది. 'ఎడ్యుకేషన్' ని నీటితోనూ, 'ఎడ్యుకేర్' ని చక్కెరతోనూ పోల్చవచ్చును. చక్కెరను ఒక టంబ్లరు నీటిలో వేసి పైనీరు త్రాగితే దానికి ఎలాంటి రుచీ ఉండదు. ఒక స్పూను తీసికొని దాన్ని బాగా కలిపినప్పుడు అడుగునున్న చక్కెర నీటిలో అంతటా వ్యాపించి ఆ నీటికి తీయదనం చేకూర్చుతుంది. మన హృదయమే ఒక టంబ్లరు, లౌకికవిద్యయే నీరు, దివ్యత్వమే చక్కెర. బుద్ధి అనే స్పూనుతో బాగ కలిపినప్పుడు, అనగా విచారణ చేసినప్పుడే ప్రజ్ఞాన సుజ్ఞానములను అందుకోగలము. కొందరు తాము జ్ఞానులమని

sri sathyasai vacharamrutam

అనుకుంటారు. "నేను జ్ఞానిని" అనుకునేవాడు నిజంగా జ్ఞాని కాడు. జ్ఞానానికి రూపం లేదు. "అద్వైత దర్శనం జ్ఞానం." అందరూ ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించటమే జ్ఞానం. అన్నింటియందున్న ఏకత్వాన్ని గుర్తించాలి. (స్వామి తమ చేతిరుమాలును చూపిస్తూ) ఇది ఒక గుడ్డ. ఇది గుడ్డ కాదు, దారముల చేరిక. ప్రత్తి లేక దారము లేదు, దారము లేక వస్త్రము లేదు. ప్రత్తి, దారము, వస్త్రము మూడూ చేరి ఒక్కటే. అదేరీతిగా మానవత్వంలోని ఏకత్వాన్ని గుర్తించాలి.

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం**

సుఖముగాని, దుఃఖముగాని అన్నింటినీ భగవదర్పితం గావించాలి. దుఃఖము కల్గినప్పుడు "అయ్యో, భగవంతుడా! నాకెందుకు దుఃఖాన్నిచ్చావు?" అని విచారించకూడదు. అందులో కూడా ఏదో ఒక సుఖముంటుందని గుర్తించాలి. "ఇది నా మంచికోసమే" అని భావించాలి. Pleasure and Pain (సుఖదుఃఖములు) రెండూ మీ మంచికోసమే. ఈరకంగా మీరు భావించినప్పుడే మీలో విశాలమైన భావాలు అభివృద్ధి అవుతాయి. చర్చిఅయినా, మందిరమైనా, మసీదు అయినా అంతా ఒకటే. కనుక ఏ మతాన్నీ విమర్శించకండి. ఇతర మతాలను విమర్శించటం భక్తుల లక్షణం కాదు. సమత్వాన్ని పోషించుకోండి, ప్రేమతత్త్వాన్ని పంచుకోండి. ఈనాడు మీరు జరుపబోయే చర్చల్లో మీకేమైనా సందేహాలు తలెత్తితే వాటికి రేపటి దినం జవాబిస్తాను.

**(20-11-2001 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

sri sathyasaivachanamrutam